క్లుప్తంగా

శాకంబరీగా కోటదుర్గమ్మ



శాకంబరీ అలంకరణలో అమ్మవారు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, పాలకొండ కోటదుర్గమ్మ శాకంబరీ దేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ అమ్మవారి విగ్రహంతో పాటుగా ఆలయంలోని ఉత్సవ విగ్రహం, ఆలయ ప్రాంగణాన్ని 116 రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులకు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

జగనన్న సురక్షను పక్కాగా అమలు చేయాలి

• డ్వామా పీడీ కిరణ్‌కుమార్

వీరఘట్టం: మండలంలోని ఏయే సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలనుకుంటున్నారో ఆ గ్రామాల్లో ఉన్న సమస్యలను ముందస్తుగా గుర్తించాలని డ్వామా పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వారం రోజుల్లో ప్రతీ సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమస్యలు లేని గ్రామాలను రూపొందించాల్సిన బాధ్యత మనపై ఉందని, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.రామచంద్రరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు

గరుగుబిల్లి: దివ్యాంగులు ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ అఖిల్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పలువురు చిన్నారులకు మంగళవారం ఫిజియోథెరపీ సేవలందించారు. ప్రతీ మంగళవారం భవిత కేంద్రంలో దివ్యాంగుల సౌకర్యార్థం ఫిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ఫిజియోథెరపీ ఒక వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు వీర్రాజు, విజయలలిత తదితరులున్నారు.

పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, గరుగుబిల్లి మండల ఎంపీపీ ఉరిటి రామారావు మంగళవారం ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిని వండవ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పార్వతీపురం మన్యం జిల్లా కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు ఉన్నారు.

అర్చకుడికి ఆర్థిక సాయం



అర్చకునికి ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్టు సభ్యులు

భామిని: మండలంలోని సింగిడి త్రినాథ స్వామి ఆలయం అర్చకులుగా పనిచేస్తున్న గణేష్ నాయక్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. వారి దీనస్థితిని చూసి చలించిన స్థానిక మన భగత్‌సింగ్ ట్రస్ట్ సభ్యులు రూ.10 వేలు విరాళాలు సేకరించి మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. అర్చకుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ట్రస్ట్ సభ్యులు కోరారు.

నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ ప్రతినిధులను సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

పాలకొండ రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో డ్రైవర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కుమార్, కాకినాడ డిపో కార్యదర్శి లక్ష్మణరావు నేతృత్వంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.కె.రావు, అధ్యక్షుడిగా కేపీ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా డీఎస్ రావు, ఎం.రవి, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.ఎం.రావు, బి.రమేష్, పబ్లిసిటీ, గ్రీవెన్సు కార్యదర్శులుగా ఎస్.వి.బి.రావు, ఎస్.ఆర్.రావు, బిబి.రమణ, కోశాధికారులుగా సీహెచ్.జోషఫ్, వీఎస్ చలంను ఎన్నుకున్నారు.

భావితరాలకు స్ఫూర్తి అల్లూరి

• ఘనంగా అల్లూరి 125వ జయంతి వేడుకలు
• నివాళులర్పించిన అధికారులు, నాయకులు

విప్లవ వీరుడు, స్వాతంత్య్ర సమర యోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో అల్లూరి సీతారామరాజు జయంత్యుత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ ఉత్సవాల్లో పాల్గొని మన్యం వీరుడికి నివాళులర్పించారు. స్వాతంత్య్ర సాధనలో ఆయన పోరాటాన్ని గుర్తుచేసుకుని స్ఫూర్తి పొందారు. – సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సిబ్బంది



గుమ్మలక్ష్మీపురం: అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీసీఎంఎస్ కార్యాలయ సిబ్బంది



గరుగుబిల్లి: తోటపల్లిలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్



వీరఘట్టం: విప్లవవీరుడు అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంబరవలస పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

నవరత్నాలతో పేద కుటుంబాల్లో ఆనందం

• ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



నెల్లికిక్కువలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతీ పేద కుటుంబం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని నెల్లికిక్కువ గ్రామ సచివాలయం పరిధిలోని డొంగరికిక్కువ, నెల్లికిక్కువ గ్రామాల్లో మంగళవారం ఆమె 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులతో కలిసి ఆయా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, మరోసారి ఆయన్ను గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, నెల్లికిక్కువ సర్పంచ్ జీలకర్ర రాములమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు దుద్దుఖల్లు సచివాలయం పరిధిలో..

మండలంలోని దుద్దుఖల్లు గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య తెలిపారు.

ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే కళావతి

• ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని బొడ్లపాడు గ్రామంలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాలకు మేలు జరిగేలా అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు మరితం లబ్ధి చేకూరేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, ఇందులో భాగంగా ప్రజలకు కావాల్సిన వివిధ రకాల ధ్రువపత్రాలను కోరిన వెంటనే అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, సర్పంచ్ మెరుగుల భవానీ, చంద్రమౌళీశ్వరరావు, వైస్ ఎంపీపీ పర్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు, మండల అధికారులు, వీఆర్‌ఓ పొన్నాడ రఘునాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

6న వాహనాల వేలం

గరుగుబిల్లి: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో సారా కేసుల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను ఈనెల 6న స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ మంగళవారం తెలిపారు. చినమేరంగి, పాలకొండ, ఎస్‌డీపీఓ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

మెరుగైన బోధన అందించాలి

పాలకొండ రూరల్: విద్యా ప్రమాణాల మెరుగుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంఈఓ పర్రి కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని తుమరాడ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి హెచ్ఎం ఎస్.ప్రవల్లికకు పలు సూచనలు చేశారు.

యజ్ఞంలా 'జగనన్న సురక్ష'



కురుపాం: కురుపాం-2 సచివాలయంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గొర్లి సుజాత, అధికారులు



గరుగుబిల్లి: నాగూరులో ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ రామారావు, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం యజ్ఞంలా కొనసాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ప్రభుత్వ సేవలను గుర్తించి ఆయా సేవలు వారికి అందేలా తక్షణ చర్యలు చేపడుతున్నారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, భూముల మ్యుటేషన్లు, తదితర 11 రకాల ధ్రువపత్రాలను అవసరమైన వారికి అందిస్తున్నారు. పాలకొండ పట్టణంలోని కోమటిపేట సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొని ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందజేశారు. - సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: దశుమంతపురంలో వృద్ధురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న డ్వామా పీడీ కిరణ్‌కుమార్



గుమ్మలక్ష్మీపురం: కుక్కిడిలో మహిళకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు



భామిని: లివిరిలో దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాలకొండ రూరల్: వెలగవాడలో అర్జీదారులకు వివిధ సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ బి.భాను, తహసీల్దార్ సోమేశ్వరరావు



వీరఘట్టం: చిట్టపులివలసలో విద్యార్థినికి కుల, ఆదాయ ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓ జయంత్ ప్రసాద్

ప్రకృతి సాగులో మహిళా సంఘాల పాత్ర కీలకం



మహిళాసంఘ సభ్యులతో సమీక్షిస్తున్న ఏడీపీఎం ధనుంజయరావు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర కీలకమని జిల్లా అడిషనల్ డీపీఎం ఎస్.ధనుంజయరావు అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర, దత్తివలస గ్రామాల్లో స్వయం సహాయక సంఘ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల పరిధిలో ఉన్న సంఘాల సభ్యులు వారికున్న భూమిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయాలని సూచించారు. విత్తన శుద్ధి చేయడం, జీవామృతాలు వినియోగంతో ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు. పెరటి తోటల సాగుతో కుటుంబానికి కావాల్సిన కూరగాయలు, పండ్లు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఏ దేవీప్రసాద్, జి.అన్నపూర్ణ, జి.పోలినాయుడు తదితరులున్నారు.

దోమల నిర్మూలనతో డెంగీ అంతం



గుమ్మలక్ష్మీపురం: మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



సీతంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం: డెంగీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు అన్నారు. పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి మంగళవారం తాడికొండ గ్రామంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ వ్యాప్తికి దోమలు వాహకాలుగా పనిచేస్తాయని, కాబట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణంలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం మానవహారంగా ఏర్పడి డెంగీ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ర్యాలీలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈఓ సింహాచలం, హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కుశిమిలో..

సీతంపేట: మండలంలోని కుశిమి పీహెచ్‌సీ వద్ద ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొలతల్లో వ్యత్యాసాలపై మండిపాటు



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ భాను

పాలకొండ రూరల్: మండలంలోని జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమాన్ని ఎంపీపీ బొమ్మాళి భాను అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి మధ్య కాలంలో మండలంలోని 32 పంచాయతీల్లో చేపట్టిన సుమారు 485 పనులకు సంబంధించి సామాజిక తనిఖీల నివేదికను డీఆర్పీలు చదివి వినిపించారు. ఆయా పనుల కోసం రూ.15.14 కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తించారు. వాటపాగు, ఎం.సింగుపురం, అట్టలి, పనుకువలస, ఎల్.ఎల్.పురం, జెజ్జి తదితర గ్రామాల్లో చేపట్టిన చెరువు పనుల కొలతల్లో 20 శాతం వ్యత్యాసం గుర్తించినట్లు చెప్పారు. పెద్దకోటిపల్లిలో ఒకరికి బదులు వేరొకరు పనులు చేసి రూ.28 వేలు వేతనం పొందినట్లు గుర్తించారు. ఈ తరహా తప్పిదాలు పునరావృత్తం కాకుండా చూడాలని అధికారులు హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కనపాక సూర్యప్రకాష్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోలుగు విశ్వేశ్వరరావు, టి.ఉపేంద్రకుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి రవేంద్ర, జిల్లా సోషల్ ఆడిట్ ప్రొసీడింగ్ అధికారి శ్రీహరి, ఎస్ఆర్పీ గోవిందరావు, ఉపాధి ఏపీఓ ఈశ్వరమ్మ, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణదాస్ పుట్టినరోజు



కృష్ణదాస్‌కు కేక్ తినిపిస్తున్న కార్యకర్తలు

సీతంపేట: నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలను సీతంపేటలో ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు మంగళవారం సీతంపేట వచ్చిన ఆయనతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులు సంఘటితం కావాలి

పాలకొండ రూరల్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు సంఘటితంగా ఉంటూ వారి హక్కులు సాధించుకోవాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎస్.ఆర్.శర్మ అన్నారు. పాలకొండలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఎఫ్ హైర్ పెన్షన్ పొందేందుకు ఈ నెల 11వ తేదీ వరకు సమయం ఉందని, అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.